క్లుప్తంగా

సింహగిరిపై ఏకాదశి తిరువీధి



తిరువీధి నిర్వహిస్తున్న అర్చకులు, సిబ్బంది

సింహాచలం: సింహగిరిపై శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో మంగళవారం ఏకాదశి తిరువీధి విశేషంగా జరిగింది. మదన గోపాలస్వామి ఉత్సవమూర్తులను పల్లకిలో వేంజేపచేశారు. ఆలయ బేడా మండపంలో సాయంత్రం తిరువీధి నిర్వహించి, విశేష హారతులు అందించారు.

సుబ్రహ్మణ్యేశ్వరుడికి విశేష పూజలు



వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి

సింహాచలం: అడవివరంలోని విజినిగిరిపాలెంలో ఉన్న వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో మంగళవారం స్వామికి విశేష పూజలు జరిగాయి. ఉదయం 6 నుంచి మధ్యాహ్నం వరకు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామికి అభిషేకాలు చేశారు. ఆలయం చుట్టూ ప్రదక్షిణ చేశారు. ఆలయ అర్చకులు ద్వాదశి సోదరులు, ఉదయ్‌కృష్ణశర్మ ఈ పూజలు నిర్వహించారు.


అప్పన్న అన్నప్రసాద పథకానికి రూ.లక్ష విరాళం



చెక్కు అందిస్తున్న దాత రాంబాబు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి శాశ్వత అన్నప్రసాద పథకానికి నగరంలోని శంకరమఠానికి చెందిన పి.రాంబాబు రూ.లక్ష 11 వేల 116 విరాళాన్ని మంగళవారం అందించా రు. సంబంధిత విరాళాన్ని చెక్కు రూపంలో సింహగిరిపై పీఆర్వో కార్యాలయంలో ప్రొటోకాల్ సూపరింటెండెంట్ వెంకటేశ్వరరావు, సీనియర్ అసిస్టెంట్ సూర్యనారాయణకు అందజేశారు. దేవస్థానం తరఫున దాతకు స్వామివారి దర్శనం కల్పించి ప్రసాదం, శేషవస్త్రం అందించారు.

45 మంది యాచకులకు ఆశ్రయం



లయోలా వృద్ధాశ్రమంలో యాచకులతో పోలీసులు

పెందుర్తి: స్థానిక పోలీస్ స్టేషన్ పరిధిలోని యాచకులు, నిరాశ్రయులను వృద్ధ, అనాథాశ్రమాల్లో ఆశ్రయం కల్పిస్తున్నారు. వెస్ట్ జోన్ ఏసీపీ పృథ్వీతేజ ఆదేశాల మేరకు సీఐ కేవీ సతీష్‌కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు 45మంది యాచకులను స్థానిక లయోలా ఆశ్రమంలో మంగళవారం చేర్పించారు. ఈ డ్రైవ్‌లో భాగంగా గొల్లవిల్లి నాగరాజు, ధనాల అప్పారావు అనే ఇద్దరు వ్యక్తులను గుర్తించి వారి కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు సీఐ తెలిపారు. నిరాశ్రయులు, యాచకులు ఎక్కడ కనిపించినా తమ దృష్టికి తీసుకురావాలని సీఐ సూచించారు.

వండర్ కిడ్ ఆరాధ్యకు అభినందనలు



ఆరాధ్యను అభినందిస్తున్న పోస్టల్ అధికారులు

పరవాడ: అంతర్జాతీయ వండర్ బుక్ ఆఫ్ రికార్డులో ఇటీవల పేరు నమోదు చేసుకున్న భర్నికం శివారు బాపడుపాలెం మండల పరిషత్ పాఠశాల విద్యార్థిని బెహరా ఆరాధ్యను అనకాపల్లి పోస్టల్ సూపరింటెండెంట్ చుక్క శ్రీనివాసరావు ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా విద్యార్థినికి సుకన్య సమృద్ధి యోజన పథకం ఖాతాను ప్రారంభించారు. పరవాడ సబ్ పోస్టు మాస్టర్ కేవీవీఎస్ గుప్తా, భర్నికం బ్రాంచ్ పోస్టు మాస్టర్ దాట్ల వరహాలరాజులు బహుమతులు అందించారు. అనకాపల్లి పోస్టల్ ఇన్‌స్పెక్టర్ సీహెచ్ ఉమామహేశ్వరరావు విద్యార్థిని అభినందించి, ఇంతటి ఘనతకు కారకులైన ఉపాధ్యాయుడు గంగాధర్‌ను శాలువాతో సత్కరించారు. సుకన్య సమృద్ధి యోజన పథకం ప్రయోజనాలను తల్లిదండ్రులకు పోస్టల్ అధికారులు వివరించారు. కార్యక్రమంలో పాఠశాల విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

మట్టి విగ్రహ బ్రహ్మలు అడవివరం కుమ్మరులు



మూడు అడుగుల మట్టి గణనాథుడి విగ్రహం

దేవుడు చేసిన మనుషులం మనం. కానీ ఆ దేవుళ్ల విగ్రహా**లను తయారుచేసేదీ మన**మే..! అలాంటి అపరబ్రహ్మల్లో **ఓ వర్గమే కుమ్మరులు**. దేవుళ్ల విగ్రహాలను తయారు **చేసే వీరి** బతుకులు దుర్భరం. ఏటా వచ్చే **వినా**యక చవితి వీరికి నాలుగురాళ్లు **వెనకేసు**కునేందుకు వచ్చే సదవకాశం. **ప్లాస్టర్** ఆఫ్ పారిస్(పీవోపీ) విగ్రహాలు **రాజ్యమేలు**తున్న తరుణంలో అడవివరం **కుమ్మరిదిబ్బ** కుమ్మరులు మట్టి విగ్రహాల **తయారీతో** పర్యావరణ హితులుగా ఉన్నారు.



మట్టి గణపతి విగ్రహానికి తుదిమెరుగులు దిద్దుతున్న కుమ్మరి శ్రీను

- ఆరు అంగుళాల నుంచి మూడడుగుల వరకు తయారీ
- కుటుంబ సమేతంగా పనుల్లో నిమగ్నం
- వచ్చే లాభం అంతా సరిసమానం

సింహాచలం: జీవీఎంసీ 98వ వార్డు పరిధి అడవివరంలోని కుమ్మరిదిబ్బకు ఓ ప్రత్యేకత ఉంది. ఈ ప్రాంతంలో తరతరాల నుంచి కుమ్మరి కుటుంబాలు నివసిస్తున్నాయి. అందుకే ఈ ప్రాంతం పేరు కూడా కుమ్మరిదిబ్బగా ప్రసిద్ధి చెందింది. ఇళ్లలో వినియోగించుకునే మట్టి డిబ్బీలు, కుండలు, పూల కుండీలు, గిన్నెలు, కూజాలు, దీపావళి రోజుల్లో మట్టి ప్రమిదలు, చిచ్చుబుడ్లు ఇతర మట్టి వస్తువులు తయారుచేస్తుంటారు.

నెలన్నరగా బిజీబిజీ

వినాయక చవితి వస్తోందంటే వీరికి క్షణం తీరిక ఉండదు. చవితికి సుమారు 45 రోజుల ముందు నుంచే వీరంతా గణనాథుడి విగ్రహాల తయారీలో తలమునకలవుతారు. ఆరు అంగుళాల చిన్న ప్రతిమ నుంచి మూడు అడుగుల ఎత్తు ఉండే విగ్రహం వరకు తయారుచేస్తుంటారు. విగ్రహాల తయారీకి అవసరమైన చెరువు మట్టి, ఇసుక, అచ్చుల కొనుగోలు నుంచి తయారు చేసిన విగ్రహాల విక్రయాల వరకు వీరంతా సమష్టిగా కష్టపడతారు. తయారు చేసిన విగ్రహాలను హోల్‌సేల్‌గా వ్యాపారులకు విక్రయిస్తారు. కొన్నింటిని తమ ఇళ్ల వద్దే ఉంచి విక్రయాలు చేస్తుంటారు. వచ్చిన లాభాలను పంచుకుంటారు.

బీఆర్‌టీఎస్ రోడ్డు విస్తరణతో..

బీఆర్‌టీఎస్ రోడ్డు విస్తరణలో భాగంగా కుమ్మరిదిబ్బ వద్ద కుమ్మరుల నివాసాలు, మట్టి వస్తువుల తయారీ కేంద్రాలను తొలగించారు. దీంతో కొందరు బట్టీలు పెట్టుకునేందుకు స్థలం లేకపోవడంతో మట్టి వస్తువుల తయారీ వృత్తిని విరమించుకున్నారు. ప్రస్తుతం ఎస్ఆర్‌పురానికి సమీపంలో కొంతమంది కుమ్మరులు కొంత స్థలం తీసుకుని బట్టీలు ఏర్పాటుచేసుకుని, మట్టి పాత్రలు, ఇతర వస్తువులు తయారు చేస్తూ వృత్తిని కొనసాగిస్తున్నారు. అడవివరంలోని కుమ్మరిదిబ్బ వద్దే 2023 వరకు వినాయక విగ్రహాలను పెద్ద ఎత్తున తయారుచేసేవారు. ఇప్పుడు ఎస్ఆర్ పురం వద్ద తయారు చేస్తున్నారు.



తయారుచేసిన గణనాథుడి విగ్రహాలు, ప్రతిమలు



చిన్న సైజు మట్టి ప్రతిమకు మెరుగులు దిద్దుతున్న మహిళ

ఆరంగుళాల నుంచి మూడడుగుల వరకు

6,9,12,15 అంగుళాల విగ్రహాలతోపాటు మూడు అడుగుల విగ్రహాలను ఎక్కువగా తయారు చేస్తుంటారు. ఆరు అంగుళాల విగ్రహాన్ని రూ.14 వరకు విక్రయిస్తారు. మూడు అడుగుల విగ్రహానికి రూ.2 వేలు వరకు ధర పలుకుతుంది. చిన్నసైజు విగ్రహాల తయారీకి పూర్తిగా అచ్చులనే వినియోగిస్తారు. మూడు అడుగు విగ్రహాల తయారీకి మాత్రం విడివిడిగా అచ్చుల్ని వేసి తర్వాత ఆ భాగాలను కలిపి, తుది మెరుగులు దిద్దుతారు.

వ్యాపారం.. అంతంతమాత్రం

విగ్రహాల తయారీలో ఒక్కోసారి నష్టాల్ని కూడా చవిచూడటం పరిపాటి. అయినా కులవృత్తిని వీడకుండా భగవంతుడిపైభారం వేసి విగ్రహాలు తయారుచేస్తారు. ఏటేటా తయారీ ముడిసరకుల ధరలు పెరుగుతున్నా సమాజంలో తమకు గుర్తింపు తీసుకొచ్చిన వృత్తిని, నమ్ముకున్న పనితనాన్ని విడవకుండా నేటికీ అదే పనిలో నిమగ్నమవుతున్నారు. కొన్నిసార్లు పెట్టిన పెట్టుబడి వస్తే చాలనుకుంటారు. ఒక్కోసారి వర్షాలు కూడా వీరిని ఇబ్బందిపెడతాయి. విగ్రహాల తయారీ సమయంలో వర్షాలు పడితే ముడిసరకులు పాడయ్యే పరిస్థితి. ఆర్డర్ల మేరకు విగ్రహాల తయారీ పూర్తయ్యాక వర్షాలు పడితే చాలా మంది వాటిని తీసుకెళ్లలేరు. దీంతో వ్యాపారం అంతంత మాత్రంగానే సాగే పరిస్థితి.



అచ్చులో మట్టి వేసి గణనాథుడి ప్రతిమ తయారుచేస్తున్న మహిళ

భగవంతుడిపైనే భారం



ఏటా మట్టి వస్తువుల తయారీ మా వృత్తి. వినాయకచవితి వస్తుంటే క్రమం తప్పకుండా గణనాథుడి ప్రతిమలు తయారుచేయడం పరిపాటి. ఒక్కో ఏడాది నష్టం వచ్చినా మా వృత్తిని మాత్రం ఆ భగవంతుడిపైనే భారం వేసి కొనసాగిస్తాం. లాభం రాకపోయినా.. పెట్టిన పెట్టుబడి వస్తే చాలని ఆశిస్తాం.

– మానేపల్లి సూరిబాబు, కుమ్మరి, అడవివరం

ముడిసరకుల రేట్లతో ఇబ్బంది



విగ్రహాల తయారీకి అవసరమైన చెరువు మట్టి, ఇసుక రేట్లు భారీగా పెరిగాయి. ప్రస్తుతం లారీ లోడ్ మట్టి రూ.5 వేలు వరకు ఉంది. సింహాచలంలో ఉన్నప్పుడు వ్యాపారుల నుంచి బాగా ఆర్డర్లు వచ్చేవి. ఊరికి దూరంగా వెళ్లిపోవడంతో ఆర్డర్లు తగ్గడంతోపాటు, రవాణా చార్జీలు కూడా పెరిగాయి.

– డి.శ్రీను, కుమ్మరి, అడవివరం

కురసాల సత్యనారాయణకు నివాళి



మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న అదీప్‌రాజ్

పెందుర్తి: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఉత్తరాంధ్ర రీజనల్ కో ఆర్డినేటర్, మాజీ మంత్రి కురసాల కన్నబాబు తండ్రి సత్యనారాయణ మృతదేహానికి పార్టీ ఉత్తరాంధ్ర యువజన విభాగం అధ్యక్షుడు, నియోజకవర్గ సమన్వయకర్త అన్నంరెడ్డి అదీప్‌రాజ్ నివాళి అర్పించారు. కాకినాడలోని కన్నబాబు నివాసంలో కలిసి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆయన వెంట గండి రవికుమార్, పలువురు నియోజకవర్గ నాయకులు ఉన్నారు.

ఘనంగా ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం



లూయిస్ డాగురె చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న పెందుర్తి ఫొటోగ్రాఫర్లు

పెందుర్తి: 186వ ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవాన్ని పెందుర్తిలోని లయోలా వృద్ధాశ్రమంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. పెందుర్తి ఫొటో, వీడియో గ్రాఫర్స్ అసోషియేషన్ ప్రతినిధులు కెమెరా సృష్టికర్త లూయిస్ డాగురె చిత్రపటానికి పూలమాల వేసి అంజలి ఘటించారు. వృద్ధులతో కలిసి ఫొటోగ్రాఫర్లు కేక్ కట్ చేశారు. పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. మధ్యాహ్నం భోజనం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు శరగడం రాము, కార్యదర్శి పెంట ఈశ్వరరావు, ఉపాధ్యక్షుడు రమణ, సలహాదారు ఎస్ఆర్‌సీ మోహన్, సభ్యులు లక్ష్మణ్, కృష్ణ, రమేష్, శ్రీను, వెంకటేశ్, నాయుడు, రమణ, శివ, సంతోష్, శేషు, సురేష్, ధనరాజ్, రామకృష్ణ, లయోలా వ్యవస్థాపకుడు దొడ్డి ప్రకాశరావు పాల్గొన్నారు.

అప్పన్నకు ఏకాదశి ఆర్జిత సేవలు



స్వర్ణతులసీదళాలతో ప్రదక్షిణ చేస్తున్న అర్చకుడు, భక్తులు

సింహాచలం: ఏకాదశిని పురస్కరించుకుని శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి మంగళవారం ఆర్జిత సేవలు విశేషంగా జరిగాయి. ఉదయం 7 నుంచి స్వర్ణతులసీ దళార్చన ఘనంగా నిర్వహించారు. ఆలయ కల్యాణమండపంలో వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను వేంజేపచేశారు. విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం నిర్వహించారు. 108 స్వర్ణ తులసీ దళాలతో అష్టోత్తరశతనామావళి పూజ జరిపారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాలను అందించారు.

వైభవంగా నిత్యకల్యాణం

శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి మంగళవారం నిత్యకల్యాణం వైభవంగా జరిగింది. ఆలయ కల్యాణమండపంలో వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను వేంజేపచేసి ఉదయం 9.30 నుంచి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణాన్ని ఘనంగా జరిపారు. ఉభయదాతలకు స్వామివారి అక్షింతలు, ప్రసాదం, శేషవస్త్రాలను అందించారు. ఆలయ సూపరింటెండెంట్ వెంకటరమణ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

‘స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను నిలిపేయాలి’



ఫార్మాసిటీలో నిరసన తెలుపుతున్న సిటు నాయకులు, కార్యకర్తలు

పరవాడ: స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణను తక్షణమే నిలిపివేయాలని సిటు జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ డిమాండ్ చేశారు. స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా సిటు ఆధ్వర్యంలో ఫార్మాసిటీలో మంగళవారం నిరసన తెలిపారు. కార్యక్రమంలో పాల్గొన్న గనిశెట్టి మాట్లాడుతూ ఈవోఐ పేరుతో బీజేపీ ప్రభుత్వం విశాఖ స్టీల్ ప్లాంట్‌లోని 44 విభాగాలను ప్రైవేటీకరించే చర్యలను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సీఎం చంద్రబాబు, డీసీఎం పవన్ కల్యాణ్‌లు జోక్యం చేసుకోవాలన్నారు. స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ నిలిచిపోయిందని, దీన్ని లాభాల బాటలో తీసుకొచ్చి కార్మికులకు న్యాయం చేస్తామని ప్రకటించిన రాష్ట్ర నేతలు ప్రైవేటీకరణపై నోరు విప్పకపోవడం విచారకరమన్నారు. ప్లాంటులోని కీలక విభాగాలను 44 ముక్కలు చేసి ప్రైవేట్ వ్యక్తులకు ధారదత్తం చేయడం దుర్మార్గమన్నారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన వాగ్దానాలను నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. నిరసన కార్యక్రమంలో సిటు నాయకులు అప్పలరాజు, చిట్టిబాబు, రమణ, శేషు పాల్గొన్నారు.

కాంగ్రెస్ సీనియర్ నేత రామయ్యనాయుడు మృతి



రామయ్యనాయుడు

పరవాడ: రావాడ శివారు ధర్మారాయుడు పేటకు చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, కార్మిక నేత కేఎస్ఏ రామయ్య నాయుడు గుండెపోటుతో మంగళవారం మరణించారు. సోమవారం గుండెపోటు రావడంతో నగరంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్చారు. అక్కడ చికిత్స పొందుతూ కన్నుమూశారు. ఆయన మృతదేహానికి గురువారం అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు మృతుని సోదరుడు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు కోన రామారావు తెలిపారు. ఆయన మృతి పట్ల మాజీ ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి పైల శ్రీనివాసరావు, జెడ్పీటీసీ పైల సన్యాసిరాజు, ఎంపీపీ పైల వెంకటపద్మలక్ష్మి, పలువురు పార్టీ నాయకులు, అభిమానులు సంతాపం తెలిపారు.

ప్లాస్టిక్ వినియోగం, నిర్వహణలో నిర్లక్ష్యంపై చర్యలు



దుకాణ యజమానికి నోటీసు అందిస్తున్న ఎంపీడీవో శివప్రసాద్ సత్యనారాయణ

సబ్బవరం: ప్లాస్టిక్ వినియోగం, నిర్వహణలో వాణిజ్య సముదాయాలు, దుకాణ యాజమాన్యాలు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఇన్‌చార్జ్ ఎంపీడీవో శివప్రసాద్ సత్యనారాయణ హెచ్చరించారు. మండల కేంద్రంలో రోడ్డుకు ఇరువైపులా ఉన్న షాపులు, వాణిజ్య సముదాయాలను పరిశీలించి ప్లాస్టిక్ వ్యర్థాల నిర్వహణపై అవగాహన కల్పించారు. ప్లాస్టిక్ వ్యర్థాలను విధిగా డస్ట్‌బిన్లలో వేసి, పంచాయతీ పారిశుధ్య కార్మికులకు అప్పగించాలన్నారు. అలసత్వం వహిస్తే కలెక్టర్ ఆదేశాల మేరకు చర్యలు తప్పవన్నారు. రోడ్డుకు ఇరువైపులా ఉన్న సుమారు 30 వాణిజ్య సముదాయాలు, దుకాణదారులకు నోటీసులు అందించారు. అదే విధంగా మలేరియా, డెంగ్యూ వంటి విషజ్వరాలు విజృంభించకుండా ప్లాస్టిక్ వ్యర్థాలు, ఖాళీ కొబ్బరి బొండాలు, టైర్లలో నీర్లు నిల్వలేకుండా చూసుకోవాలన్నారు. ఆయన వెంట సబ్బవరం పంచాయతీ కార్యదర్శి రాజేశ్వరరావు, తదితరులు ఉన్నారు.

పీఎం జీవన జ్యోతి బీమా చెక్కుల అందజేత



బీమా చెక్కులను అందిస్తున్న ఎస్‌బీఐ బీఎం రాజశేఖర్, తదితరులు

సబ్బవరం: ఖాతాదారులు బ్యాంకింగ్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని సబ్బవరం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఎస్‌బీఐ) బ్రాంచ్ మేనేజర్ డి.రాజశేఖర్ తెలిపారు. స్థానిక ఎస్‌బీఐ ఆవరణలో కేంద్ర ప్రభుత్వ ప్రధానమంత్రి జీవన జ్యోతి బీమా యోజన పథకం చెక్కులను మంగళవారం లబ్ధిదారులకు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్‌బీఐ ఖాతాదారులైన సాలాపు అప్పారావు, మండల రమ్య, ఆర్.నూకరాజులు పీఎం జీవన జ్యోతి పథకంలో రూ.436 బీమా ప్రీమియం చెల్లించి, బీమా పథకం తీసుకున్నారని పేర్కొన్నారు. ఇటీవల వారు మరణించడంతో వారి కుటుంబ సభ్యులకు రూ.2 లక్షలు చొప్పున పరిహారం చెక్కులను అందించామన్నారు. ఖాతాదారులకు బ్యాంకుల ద్వారా ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో బ్యాంక్ సిబ్బంది పైల ప్రసాదరావు, రాజేశ్వరరావు, ఖాతాదారులు పాల్గొన్నారు.


ప్రమాదకరంగా ట్రాన్స్‌ఫార్మర్



నంగినారపాడు కొత్తూరు వద్ద ప్రమాదకరంగా దర్శనమిస్తున్న ట్రాన్స్‌ఫార్మర్

సబ్బవరం: మండలంలోని జీవీఎంసీ 88వ వార్డు పరిధి నంగినారపాడు కొత్తూరు వద్ద విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ప్రమాదకరంగా మారింది. రోడ్డునానుకుని ట్రాన్స్‌ఫార్మర్ కింద ఉన్న కంట్రోల్ బాక్స్‌కు డోర్లు లేవు. చిన్న పిల్లలు, పాదచారులతో పాటు పశువులు అటువైపుగా వెళ్లేటపుడు ఏ మాత్రం తాకినా ప్రమాదం తప్పదని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. దీనిపై పలుమార్లు ఫిర్యాదులు చేసినా విద్యుత్ సిబ్బంది స్పందించట్లేదని ఆక్షేపిస్తున్నారు. ప్రమాదం జరిగాక బాధపడే కంటే.. ముందుగానే స్పందించి ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ రక్షణ కంచె ఏర్పాటుతోపాటు కంట్రోల్ బాక్స్‌ను సరిచేయాలని కోరుతున్నారు.

రౌడీషీటర్ల ఇళ్లలో ఆకస్మిక తనిఖీలు



రౌడీ షీటర్ల ఇళ్ల తనిఖీలకు బయల్దేరుతున్న పోలీసులు

పెందుర్తి: పెందుర్తి సర్కిల్ పరిధిలో రౌడీషీటర్ల ఇళ్లలో పోలీసులు మంగళవారం ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. డిప్యూటీ కమిషనర్ జోన్–2 మేరీ ప్రశాంతి, వెస్ట్ జోన్ ఏసీపీ పృథ్వీతేజ ఆదేశాల మేరకు స్టీల్ ప్లాంట్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్(స్పెషల్) కేశవరావు పర్యవేక్షణలో 31 మంది పోలీసులు 9 బృందాలుగా ఏర్పడి 17 మంది రౌడీషీటర్ల ఇళ్లను అణువణువూ తనిఖీ చేశారు. అయితే వారి ఇళ్లలో చట్టవిరుద్ధంగా ఎలాంటి వస్తువులు కనిపించలేదు. స్థానికులు వారి ప్రవర్తన ప్రతికూలంగా ఏమీ లేదని చెప్పినట్లు సీఐ వెల్లడించారు. అయితే రానున్న రోజుల్లో శాంతి భద్రతలకు విఘాతం కలిగించే చర్యలకు పాల్పడితే కఠినంగా వ్యవహరిస్తామని హెచ్చరించారు. రౌడీషీటర్లు ఎలాంటి చట్ట వ్యతిరేక చర్యలకు పాల్పడినా తక్షణమే తమకు సమాచారం ఇవ్వాలని ప్రజలకు సూచించారు. సమాచారం అందించే వారి వివరాలు పూర్తిస్థాయిలో గోప్యంగా ఉంచుతామని భరోసా ఇచ్చారు. తనిఖీల్లో ఎస్ఐలు ఎస్వీ భాస్కరరావు, దేవుడినాయుడు, ఏఎస్ఐలు కాళీ ప్రసాద్, ఈశ్వర్ కుమార్, శాంతారావు, సిబ్బంది పాల్గొన్నారు.

ముగిసిన ఔత్సాహిక పారిశ్రామికవేత్తల శిక్షణ



కన్వీనర్ విజయకుమార్‌తో శిక్షణ పొందిన ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు

సబ్బవరం: ఔత్సాహిక పారిశ్రామికవేత్తల అవగాహనకై ట్రీజ్ ఐటీ ప్రై.లి. ఆధ్వర్యంలో ప్రపంచ బ్యాంకు, ప్రభుత్వ సహకారంతో నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమం మంగళవారంతో ముగిసింది. అసకపల్లి ఎస్సీ కాలనీ సామాజిక భవనంలో గత నెల 21న ప్రారంభించిన ఈ శిక్షణ కార్యక్రమంలో పరిశ్రమల ఏర్పాటు, లాభనష్టాలు, ప్రభుత్వ ప్రోత్సాహంపై ట్రైనర్ గండి సత్యనారాయణ వివరించారు. ముగింపు కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన యూనియన్ బ్యాంక్ సబ్బవరం శాఖ బ్రాంచ్ మేనేజర్ డి.రాజేష్ పలు సూచలు చేశారు. రెండో బ్యాచ్ శిక్షణ కోసం 18–45 ఏళ్ల మధ్య వయసున్న ఔత్సాహిక నిరుద్యోగ యువతీ యువకులు తమ పేర్లు నమోదు చేసుకుని, ఈ శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని కన్వీనర్ పి.విజయకుమార్ కోరారు. ఆసక్తిగల వారు 99631 74608, 95739 60852 నంబర్లలో సంప్రదించవచ్చన్నారు.

సచివాలయ ఉద్యోగులకు సత్కారం

అగనంపూడి : జీవీఎంసీ 85వ వార్డు బీసీ కాలనీ వార్డు సచివాలయ సిబ్బందిని స్థానిక ప్రజా సంఘాల నాయకులు మంగళవారం సత్కరించారు. ఇటీవల ఇక్కడికి బదిలీపై వచ్చిన వార్డు సచివాలయ కార్యదర్శులను సత్కరించి ప్రజలకు మెరుగైన సేవలు అందివ్వాలని కోరారు. నాయకులు మేడిశెట్టి వెంకటేశ్వరరావు, తలారి శ్రీనివాసరావు, కొరాయి జగదీష్, తిర్రి సత్యనారాయణ, వి.గీతా అన్నపూర్ణ, కరణం అప్పారావు, పూడి యుగంధర్, గురుమూర్తి పాల్గొన్నారు.